# మాటలో మమత

"అత్తలేని కోడలు సుఖవంతురాలూ..."

"కోడలు లేని అత్త గుణవంతురాలూ..." అని చిన్న కూనిరాగం తీస్తూంది చింతపండు తీస్తూ ఒకావిడ—

"అత్త అంటే జ్ఞాపకం వచ్చింది— చూశావూ! ఆ లక్ష్మమ్మ కోడలు— ఆవిణ్ణి అత్తా అని పిలవదుట!" అని అంది సముద్రాలు విస్తర్లు కుడుతూ.

"అలాగా! ఎంచేతో! సిగ్గో ఏమిటో!" అంది— ఒత్తులు నలుపుతూ ఒకావిడ.

"సిగ్గేమిటి? అదో యిది— సాధారణంగా ఎలాగూ పిలవదుట! ఒట్టి ముఖావంగా మాటాడుతుంది! యింక ఏనాడైనా పిలవ్వాలసివస్తే 'ఏమండీ' అని మొగాళ్ళని పిలిచినట్టు అంటుందిగాని నోరారా ఆ ముక్క అనదు!"

"బావుంది! ఇదెక్కడా వినలేదు! పెద్దింటి పిల్లకదూ! పరువు, నామోషీకం కామోసు!"

"ఆఁ! లక్షాధికారి కూతురా; కోటీశ్వరుడి కూతురా; అలాగంటావు? అయినా గొప్పవాళ్ళ పిల్లయితే మాత్రం అలా పిలవకూడదని వుందా ఏమిటి!"

"చక్కా అత్తా అనో, అత్తగారూ అనో పిలిస్తే ఎంత బావుం టుంది? ఆవిడ మనస్సు ఎంత సంతోషిస్తుంది!"

"అయినా ఎందుకలా పిలుస్తుంది! అంత గర్వం కూడదు!"

"అబ్బే గర్వం గిర్వం లేదుగాని– ఇలా అడుగుతే– నాకు 'తెలీ దండీ' అని అంటుంది!"

"బావుంది. ఏమని పిలవాలో తెలీదూ! ఎంత ముద్దరాలమ్మా! ఇలాంటి ముద్దూ ముచ్చట్లకోసమేకదా వాళ్ళని తెచ్చుకొనేది!"

"అవును మరి! ఒక్కగానొక్క కొడుకు మరి ఆవిడని అత్తా అని నోరారా పిలవడానికి, విని, సంతోషించడానికి– ఇంకెవరున్నారు? ఇలా అయితే ఆవిడ మనస్సు క్షోభపడదూ!"

"పాపం! ఆవిడ ఎంత నొచ్చుకుంటూందో!"

"ఏమో లోపునే మనుకుంటూందో గాని పైకిమాత్రం అంత అలా ఏమీ అనుకున్నట్టు కనిపించదు. అయినా ఈ మధ్య మాటల్లో ఒకసారి అంది–తనని అలా పిలవద్దు అని...అయినా ఆ ఒక్కకోడల్ని ఏరికోరి తెచ్చుకున్నందుకు ఆవిడకా సరదా తీరింది కాదు!"

"అందరిలాటి మనిషి ఆవిడకాదు కాబట్టి సర్దుకుపోతూంది. మన దగ్గిర అలా పిలవడానికి సిగ్గుపడుతూందేమోగాని ఇంట్లో పిలవక అవు తుందా?"

"అయ్యో లేదమ్మా! ఎక్కడయినా ఇదే వరస! లేకపోతే అను కోడం దేనికి? అయినా మన కెందుగ్గానీ..."

"ఈ కాలపు పిల్లలికి ఇదో పెడసరం! ఏమయినా అంటే ఇదవు తారు...గానీ...అత్తా అని పిలిస్తే దాని కొంపేం మునిగిపోయింది! వజ్రాలూ, వైఢూర్యాలూ, రాలిపోతాయా?"

"కొంచం గట్టిగా చెప్పి చూస్తే పిలవకేంచేస్తుంది. దాని మొగుడేనా కేక లెయ్యలేదూ!"

"అదేం చిన్నపిల్లా చితక పిల్లా! దానంతట అది నేర్చుకొని గ్రహించుకోవాలి గాని ఈపాటిదానికోసం జుట్టలాడుకుంటారా?"

"మొదట్లో అయితే కొత్తకాబట్టి సిగ్గుపడుతూంది అనుకున్నాం గాని, మూడేళ్ళయి కాపరానికి వచ్చినా ఒక్కలాగే వుందాయె."

"మరోపాటి వాళ్ళయితే ఈ పాటికి వీధిని పడిపోయివుందురు... చిన్నపిల్ల...రానురాను అనుభవంమీద దానికే తెలుస్తుంది!"

"ఇంకేం తెలుసుంది...ఇంకా మొండికెత్తి ఇదే అలవాటయి పోతుంది...పిల్లల్ని కనే యీడొచ్చి యిదే ఇలా పిలవకపోతే యింకా ఆ మనవలు వరసలు పెట్టి పిలుస్తారని ఎలా అనుకుంటాం? పేర్లుపెట్టి పిలిస్తే సిగ్గు సిగ్గు!"

"అదీకాక వాళ్ళేం పట్టించుకోక వూరుకున్నారుగాని వాడు నాలుక్కాకలేస్తే పిలవకేం జేస్తుంది!"

"ఆ మాట పుట్టింది. ఇంకా ఆవిడ ఏమయినా అంటుందేమోగాని వాడు పల్లెత్తు మాటయినా అనడు...సరికదా! వీధిలో మనలాటివాళ్ళ మాటలు విని ఎక్కడ నేర్చుకుంటుందో అని...ఎక్కడికి వెళ్ళనివ్వడు తెలుసా?"

"అంత వాడయేడూ?"

"ఇంకా ఏ జూసేవూ! ఇంట్లో ప్రతీద్వారానికీ ఘోషావాళ్ళలా దేరాలు కట్టేశాడు...ఆ రంభకి దిష్టి తగులుతుందని...ఇంత ఘోషాలో పుంచి కట్టుజేస్తున్నాడు...!"

"స్వతః పుట్టుకు రావాలిగాని వీడెంత చేస్తేమాత్రం ఏం లాభం? అయినా నిన్నటివరకూ మన కళ్ళముందు ఆడుకొనేవాడు! ఎంత వాడయి పోయాడ?"

"మరి పెద్దవాడవడం లేదూ?"

"అందుకేకామోసు మనం లక్ష్మమ్మతో కూర్చుని వాళ్ళ గుమ్మంలో మాటాడుకున్నా అది పైకి రావడంలేదు..."

"అవును...వాడే...వద్దని చెప్పేడట!"

"ఇహ రెండు రోజులు పోయాక ఎవర్నీ గుమ్మం ఎక్కనివ్వడు కామోసు!"

"అంతవరకూ ఎందుకూ? మొన్న ఆ సూరమ్మా, రావమ్మా జట్టీ లాడుకొని వాళ్ళ సోది వెళ్ళబోసుకుందికి వాళ్ళింటికెళితే... 'ఇహమీదట ఇలాటి మాటలు మా ఇంట్లో చెప్పడానికి వీల్లేద'ని 'యిలాటి మాటలాడిన వాళ్ళని, చెప్పడానికి వచ్చినవాళ్ళని గుమ్మం ఎక్కనివ్వన'నీ యింకా ఏవేవో అని వాళ్ళని పొమ్మన్నాడుట తెలుసా?"

"ఆఁ! ఏమిటీ? ఇదంతా పెళ్ళాం పాడయిపోతుందనే కాబోసు! లోకంలో వీడొక్కడే పెళ్ళాన్ని పెళ్ళాడాడా ఏమిటి? అయినా వాడంత వద్దంటూంటే ఎవరికంత ఖర్మం వాళ్ళింటి కెళ్ళేవరకూ ఈ బుద్ధి ఎలా పుట్టిందో గాని యింతకుపూర్వం ఎరగడు..."

"ఇంతలా వాడంటున్నా ఆ లక్ష్మమ్మ వూరుకుందా ఏమీ అనక?"

"ఆవిడేం చేస్తుంది? ఏమయినా అంటే వాడు— 'నా ఇష్టం' అంటాడు."

"బావుంది...ఇరవై ఏళ్ళబట్టీ...అందరికీ అలవాటయిపోయింది. వాళ్ళింట్లో కూర్చుని కష్టంవచ్చినా సుఖం వచ్చినా మాటాడుకోడం. వాళ్ళ తాతయ్యా వాళ్ళూ ఎంతోమంది పెద్దవాళ్ళు వుండేవారు గాని వాళ్ళ జోలికే వచ్చేవారు కారు. ఎంతమంది ఆడవాళ్ళు గుమ్మంలో వున్నా దించిన తల ఎత్తకుండా ఆ పక్కనించే వెళుతూ వస్తూండేవారుగాని ఏదయినా ఇలా అడ్డు చెప్పేరా? ఈనాటికి వీడేనా మహా తెలివయినవాడు?"

"అబ్బే! వాడూ అలా అనలేదే! వాడి ఖర్మం వాడి పెళ్ళాన్ని వెళ్ళవద్దన్నాడు గాని మనల్నెవర్నీ రావొద్దనీ, చెయ్యొద్దనీ అనలేదు... మాటొస్తే మంచీ, చెడ్డా, రెండూ అనుకోవాలి."

"ఆఁ! వాడంటేమాత్రం మనం వెళ్ళడం మానుతామా ఏమిటి?"

"ఇంక వూరుకుందురూ లక్ష్మమ్మ వస్తున్నట్టుంది. వింటే బావుండదు..." అని ఒకావిడ అనేసరికి, అందరూ అటువైపు చూసి అప్పటికా ప్రసంగం మానేసేరు.

* * * *

"ఏమండీ లక్ష్మమ్మగారూ పైని గూర్చున్నారు? ఇంట్లో ఎవరూ లేరా ఏమిటి? యివ్వాళ అగ్గిపుల్లలు ఇంట్లో నిండుకున్నాయి. కాస్త నిప్పు పట్టుకు వెడతాను"...అంది కెరటాలు ఇనపగరిట చేత్తో పట్టుకు వచ్చి వీధిలో కూర్చున్న లక్ష్మమ్మని చూసి—

"వెళ్ళమ్మా! వాడి పెళ్ళాం వుంది ఇస్తుంది!"

"అదేమిటండోయ్! అలా అంటున్నారు...వాడి పెళ్ళాం ఏమిటి కోడలనక?"

"ఇంకెందుకమ్మా! నన్నది అత్తా అని పిలిస్తే లోకువయిపోతుంది అంచేత నేను మాత్రం కోడలా అని పిలుస్తే తక్కువయిపోనూ? ఇహ నుండి నేనూ అలా పిలవదల్చుకోలేదు...నాకేల..." అంది నవ్వుతూ లక్ష్మమ్మ.

"బావుందమ్మా! బావుంది! అత్తా కోడళ్ళ మధ్య ఇలాటి పేచీ ఎక్కడా చూడ లేదు. ఇంట్లో పెత్తనం కోసమో, డబ్బు కోసమో, అధికారంకోసమో, మర్యాదకోసమో, జట్టీలాడుకుంటారు గాని—"

"అలాంటి పేచీ మీ ధర్మాన్న లేవులెండి...అయినా ఇదో పేచీ అని ఎవరన్నారు. అలా పిలవనంత మాత్రంలో పోయిందేంటి-చిన్న పిల్ల పుట్టినే హాస్యానికి అలా అన్నాను అంతే—"

"మీ రేమనుకుంటున్నారోగాని వీధిలో వాళ్ళు మాత్రం వూరుకో లేదు...మీ కోడలు, గొప్పింటి బిడ్డట...అంచేత, అత్తా అని పిలవడానికి పరువు తక్కువట! యింకా వూరంత గర్వం, పెడసరంట! ఇంకా ఇలా-ఏమిటో నానా మాటలూ...ఈ చెవిని వినడం, ఆ చెవిని వదిలేయడం గాని ఇలాంటివి నాకు జ్ఞాపకం వుండవు. వాళ్ళే అనాలిగాని నే చెప్ప లేను..."

"ఇందులో ఏమిటి తప్పుందని ఈ పాటి దానికి అంతలా అను కుంటున్నారు? మాకేమీ లేనిది మధ్యవాళ్ళ కెందుకండీ!"

"అదేమిటో నాకేం తెలుసు! ఘోషా వాళ్ళలా మీరు యింట్లో డేరాలు కట్టుకున్నారట? మీ వాడు యింటి కెవర్నీ రావొద్దన్నాడట!

వాడి పెళ్ళాన్ని వీధిలో ఎవరితోనూ మాటాడవద్దన్నాడట? ఎక్కడికీ వెళ్ళొద్దన్నాడట...ఇలా మీ వాడు అన్నాడనీ అందరూ అనుకుంటూంటే మీతో చెప్పేను...నాకేం తెలుసమ్మా!"

ఇది విని లక్ష్మమ్మ ఆశ్చర్యపోయింది...

"ఇంత వుంటే అంత చేస్తారు...మా వాడేం అంత తెలివితక్కువ వాడు కాదు. మనం పెద్దవాళ్ళం ఏమనుకుంటే వాడికేం వాడి సుఖ్ఖకే రాడు. పైకి నాజూకుగా వుండాలని ఆ కట్టెన్నూ అవీ కట్టేడు గాని, అందరూ...యిలా ఘోషాలనీ, అదనీ ఇదనీ అర్థాలు తీసి అనుకుంటారనా? అలాటి మాటలెప్పుడూ వాడనలేదు...అయితే మనందరితోనూ బాతాఖానీ చేస్తూ వుట్టినే కూర్చునే కన్న...చదువుకోడమో, అల్లుకోవడమో, మరేవో పనికొచ్చే పని చేసుకుంటే మంచిదన్నాడుగాని, ఎవరితో మాటాడవద్దని గాని ఎక్కడికి వెళ్ళవొద్దని గాని అనలేదు! ఇదుగో పులి అంటే అదుగో తోక అంటారు! ఇంతకి ఎవరా అన్నది—" అని చెబుతూ అడిగింది ఆవిడ—

"ఎందుకులే అమ్మా! తెలుస్తే నన్ను నవశాస్త్రాలూ పెట్టి తిడతారు!"

"ఫరవాలేదు చెప్పండీ!"

"ఎవరితో అనకండి గాని, యింకెవరూ మొన్న ఆ సూరమ్మా, కాంవమ్మా మీ యింటికొస్తే మీవాడు పొమ్మన్నాడు కదూ...! వాళ్ళే పుట్టించుగొచ్చారు యిదంతా! నాలాటి వాళ్ళకేం బాధ లేదుగాని, వాళ్ళిద్దరూ వూరుకుంటున్నారా! లేనిపోనివన్నీ కల్పించి చెబుతున్నారు."

"బాగానే వుంది...కానీండి..."

"ఆ మధ్య వనాలూ వాళ్ళూ జట్టి ఆడుకోగా—ఆ వనాలు కూతురు ఏడుస్తూ వచ్చి మీ గుమ్మంలో కూర్చుందనీ, అది మీ వాడు చూసి—'మా ఇంటి గుమ్మంలో కూర్చుని ఏడిచావంటే ఒప్పుగోనని. వెంటనే పోతావా? పోవా?' అని తగిలేశాడనీ అంటున్నారు చూశావా!"

"అవునమ్మా! ఎక్కడెక్కడో ఆడుకున్న జట్టీలన్నీ ఇక్కడ మా యింటిలోకి వచ్చి వణ్ణస్తూ గోల పెడితే వాడికి కిట్టదు. వాళ్లూ వాళ్ళూ తన్నుకొని మా ఇంటికి అర్ధరాత్రప్పుడు ఏడవడానికొస్తే ఏమయినా బావుందా? అందుకే పొమ్మన్నాడు! ఇందులో తప్పేవిటి? వాళ్ళకి ఒదిగి ఉండడానికి మాకేం ఖర్మం."

"అలాగ చెప్పు! అయినా ఎంత ఓఘాయిత్యం లేదమ్మా...ఒక ఇంటికి అర్ధరాత్రప్పుడు వచ్చి మొర్రోమని ఏడుస్తూ కూచ్చుందికి—మంచి పనే చేశాడు! అంతి నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు!"

"అవునా! మరి అందరి దగ్గరా అలా చెబుతూంటే బావుందా!"

"తెలివితక్కువ వాళ్ళతో మనకేంపని, వూరుకోమ్మా! వాళ్ళను కున్నంతలో నీకేం పోయింది!"

"అయినా ఒకళ్ళ గొడవ అందరికీ ఎందుకో!"

"నే వెళ్ళొస్తానమ్మా! ఇంకా వండుకోవాలి!" అని చెప్పి కెరటాలు నిప్పుదీసుకు వెళ్ళిపోయింది.

ఈవిడ వెళ్ళిపోగానే లక్ష్మమ్మకి ఏమీ తోచక ఇంట్లోకి వెళుతూ, గదిలో ఆమె కొడుకు...కోడల్ని కేకలేస్తున్నట్టు వినిపించి, కొంచెం ఆగింది.

"నా మాటకేంగాని చూశావా! ఆఖరికి నువ్వు అలా పిలవలేదని ఎంతలా, ఎన్ని విధాల అనుకుంటున్నారో..." దీనికి కోడలి జవాబు వినపడలేదు. అతని గొంతుకే వినబడుతూంది.

"......"

"నీ కసలు ఆ జ్ఞానం వుంటే బావుణ్ను."

"......"

"ఎన్నోసార్లు చెప్పేను—అత్తా అని పిలిచినంత మాత్రంలో ఏం మునిగిందని."

"......"

"ఇంతకీ అసలు ఎందుకలా పిలవ్వో చెప్పవు కద."

"......"

"నిన్నిలా యీపాటిదానికి అందరూ కల్పించి అంటూంటేనే బావుందా !"

"......"

"అయితే నీకు నిజంగా గర్వం అయి వుంటుంది—లేకపోతే పెడసరం-ఇంకేమిటి ?"

"బావుందండీ" మెల్లి గా అంది ఒక్క ముక్క ఆమె.

"మరేవిటనుకోడం—"

ఇలా అతను కేక లేస్తూంటే లక్ష్మమ్మ వచ్చి "బావుందిరా ! తప్పుకాదూ! దాన్ని అలా కేకలేస్తావేమిటి?" అని అడిగింది.

"అవునమ్మా! అందరిచేతా అనిపించుకోడం దేనికి ఆ మాత్రంలో దీనికేం పోయిందని.."

"వెధవలు ఎవళ్ళో అనుకున్నారని దీన్ని కేకలెయ్యడం ఏమిటి-దానికి పిలవాలని లేకపోతే నిర్బంధం ఏమిటి ?"

"పోనీ ఎంచేత పిలవదో చెప్పదుకద ?"

"అవునమ్మా! కమలా చెప్పు! ఎంచేత అలా పిలవ్వు ? నీ కిష్టం లేదా? ఇంతలా అందరూ అనుకోడం మనకి మంచిదికాదు...పోనీ నువ్వు పిలవకపోయినందువల్ల నాకేం కష్టం లేకపోయినా, వీధిలోవాళ్ళ నోరు కట్టడానికయినా ఆ ముక్క అందూ.పోనీ వాళ్ళెవళ్ళయినా ఉన్నప్పుడూ ఎవళ్ళయినా ఇంటి కొచ్చినప్పుడూ అంటూ వుండు చాలు !" అని కోడలితో అంది. అంత వరకూ మాటాడకండా వింటూన్న కమల కళ్ళంట నీళ్ళు తిరిగేయి.

"ఏం చేసేదండీ! మీరు నమ్మరు! అదేవిటో, ఎన్నిసార్లోమిమ్మల్ని అలా పిలుద్దామని అనుకుంటాను ! అనుకోవడం ఏమిటి ! తప్పకుండా పిలుస్తాను అని ఒట్టుకూడా వేసుగుంటాను...కాని—ఎంచేతో మీ దగ్గ

రికి వచ్చి మిమ్మల్ని చూసేసరికి అనలేక పోతున్నాను. అందామని పెది మలదాకా తెచ్చుకుంటాను...అంతే...మరి అనపడదు...నేనేం చేసేది ! అంతకన్నా నాకేం తెలియడంలేదు! ఎంచేత అలా అవుతూందో అని నాకే ఆశ్చర్యం వేస్తుంది. ఆ తర్వాత అనలేక పోయానని నాకు ఏడుపు కూడా వస్తుంది. ఏం చెయ్యనూ!" అంది కమల.

"పోనీలేరా! పూరుకుందూ మరేపీ అనక!" అని కోడల్ని తనతో తీసుకు పోయింది.

* * * *

"కందిగుండ లేదూ !"

"మడిలో వుండిపోయిందండి !"

"అమ్మని పిలువు వేస్తుంది !"

"ఏమండీ..."

"వస్తున్నా..."

"అదుగో...మళ్ళీ ఇంత చెప్పినా...ఆ పిలుపు మానవు...అత్తా అని పిలవలేవూ !"

అది వినగానే కమల చిన్నబోయి పూరుకుంది.

"నీ కెన్నిసార్లు చెప్పినా జ్ఞానంలేదు. మొండికెత్తిపోతే ఏం చెయ్యనూ !"

"అబ్బ పూరుకుందురూ వింటారు !"

"బావుంది పూరుకోక ఉరెట్టుగుంటానా ? లక్షసార్లు చెప్పేను. అది చిన్నబుచ్చుకుంటుందని...నీ సొమ్మేం పోయింది అలా పిలిస్తే-"

"......"

"ఆఖరికి వీధులో కూడా అందరి నోట్లోనూ పడిపోయావు. నలుగురూ మొహం యీడుస్తున్నా సిగ్గులేదూ ! ఈపాటిదానికి మహాయిది చేస్తున్నావు అందరూ పెడసరం అని అనుకోరూ ?"

"నాకేమిటో అలా పిలవాలని ఎన్నిసార్లు అనుకున్నా ఆ వేళకి రాకుండా వుందండీ!"

"ఏడిచావు ఎలా వస్తుంది...? చెప్పినట్టు చెయ్యాలని వుంటే కదూ...అయినా ఇదేదో ఆఖరికి బావుండేట్టులేదు. పైకి అమ్మ ఏమీ అనకపోయినా లోపల ఎంత అనుకుంటూందో నీకేం తెలుసు? పోనీ అత్తా అని పిలవడానికి సిగ్గయితే అమ్మమ్మా అని పిలవరాదూ, మీ అమ్మ వరసని–" అని ఇలా అంటూండగా–లక్ష్మమ్మ వచ్చి–

"అదేవిట్రా నాయనా! పెళ్ళి అయిన తర్వాత కూడా 'అమ్మమ్మ' ఏమిటి, అక్కయ్య కూతురయితే మాత్రం నీకు పెళ్ళాం అయిన తర్వాత నాకూ కోడలయింది. దానికి నేను అత్తగార్ని కాబట్టి ఇప్పుడూ అమ్మమ్మా అని అంటే ఏం బావుంటుంది?" అంది.

"చూశావా! నా మాట వినవూ యిహ నయినా, అలా పిలవడం మాని సవ్యంగా పిలువు. ఇందులో తప్పేవిటి?" అని అతను చెబుతూంటే పోస్టువాడు ఉత్తరం తెచ్చి యిచ్చేడు. ఆ ఉత్తరం లక్ష్మమ్మ అన్నగారి కూతురు దగ్గిరనుండి వచ్చింది. అది అతను చదివి–"అర్జంటుగా ఏదో పని ఉండి లక్ష్మమ్మని రమ్మన్నారని" ఉందని చెప్పేడు. లక్ష్మమ్మ కూడా ప్రయాణమై ఆ మర్నాడే బయలుదేరింది.

*   *   *   *

"ఓహో! అత్తేనా! ఏమిటి పిలవగానే వచ్చేశావు? ఎప్పుడూ లేదు! కొంప మునిగిందే!"

అత్తా! అని గుమ్మంలో కాలు పెట్టగానే పిలిచేసరికి లక్ష్మమ్మకి ఏదో చెప్పలేని సంతోషం కలిగింది. తను ఎన్నడూ ఎరుగని ఆనందం అనుభవించింది.

"ఏదోలే చూడాలనివుండి వచ్చేసా. మరి ఏదో అర్జంటుగా రావాలని రాసే!" అని అంది.

"ఏంలేదత్తా అలాగని రాస్తేగాని నువ్వొస్తావా? నేనే అలా రాయిం

చేసు! అయినా నువ్వింత వేగిరం వస్తావని అనుకోలేదు. ఇవాళేదో వుంది ప్రళయం అందికే మబ్బుకూడా వేసింది!"

"నీ వేళాకోళం పోయింది కాదు"

"రా అత్తా స్నానం చేద్దుగాని, భోంచేసి తీరుబడిగా మాటాడుకుందాం."

"అలాగేలే" అని అందిగాని తనలో ఇలా మాటిమాటికీ మేనకోడలు అత్తా అని చనువుగా పిలుస్తూంటే భరించలేని ఆనందం కలిగినా, తన స్వంతకోడలు పిలవలేదని విచారించకపోలేదు! అలా ఆమె పిలుస్తూంటే అక్కడే ఎన్నాళ్ళయినా వుండిపోవాలనికూడా అనిపించింది. ఆమె అలా పిలిచేటప్పుడల్లా ఏదో తనకు కొరత అయిన వస్తువు లభించినట్టు, ఏదో లోటు తీరినట్టు అనిపించింది ఆ మహానందంలో ఎన్నాళ్లో వుండిపోయింది. ఒకనాడు వుండబట్టక మాటల్లో 'తన కోడలు అత్తా అని ఎంతచెప్పినా పిలవద'ని చెప్పేసింది. ఆ వెంటనే మేనకోడలు చిన్న ఉపాయం చెప్పింది. లక్ష్మమ్మ అలానే చెయ్యడానికి నిశ్చయించుకుంది. ఓనాడు తన కొడుకు దగ్గరనుండి బయలుదేరి రమ్మంటూ వుత్తరం వచ్చింది.

* * * *

ఆవేళనుండి తన భర్త తనతో మాటాడక పోవడం, దగ్గరకు పిలవకపోవడం చూసి కమలకి ఏంతోచలేదు. అయినా ఎలాగో వూరుకుంది కాని రోజూ రోజూ అతను సమంగా వేళకి ఇంటికి రాకపోవడం, భోజనం సమంగా చెయ్యకపోవడం, మాటిమాటికీ కసురుతో చిరాకుగా వుండడం ఎక్కువయి పోడంబట్టి ఇంటిపట్టున ఉండక పోవడంబట్టి కమలకి ఏమనాలో తోచిందికాదు. ఆఖరికి ఏడుపుకూడా వచ్చింది. తనేం తప్పు చెయ్యందీ కూడా ఎందుకిలా అవుతూందో అని భరించలేక ఆఖరికి ఆనాడు తమలపాకులు అందిస్తూ ఆయన తీసుకోనక పోయినా ఇలా అంది.

"ఏమండీ"

"........."

"ఏమండీ–మాటాడరు?"

"ఏవిటి మాటాడ్డం నీ మొహం పో. అవతలికి. నాతో మాటాడ వద్దు!"

"అదేవిటండి అంత కోపం! నాలుగురోజులయి అన్నమేనా సర్గ్గా తినకుండా ఇంట్లో వుండకుండా వున్నారు ఏంచేశాను?"

"అందుకూ నీ శెలవే వుండాలా ఏవిటీ? నాయిష్టం–"

"అదికాదండి. కోపం అయితే పోనీండి గాని వేళకి ఇంత సర్గ్గా తిని పోకూడదా అని! అయినా నేనేం చేశానని ఇంత కోపం?"

"ఏమీలేదు నా ఖర్మ!"

"బావుందండి! ఏదైనా తప్పుంటే చెప్పండి—ఏంచేశానూ?"

"ఏంచెయ్యాలి? ఆఖరికి మా అమ్మని రాకుండా చేశావు. మంచి ఎత్తే వేశావు!"

ఇది వినగానే కమలకి గుండె ఆగినంత పనయింది. తనేవిటి? అత్తగార్ని రాకుండా చెయ్యడం ఏమిటీ అని.

"అదేమిటండీ, ఇలాటి మాటలు! నేనెందుకలా చేస్తాను? నాకేం కష్టమా?"

"ఏమో మరి అలాగే వుంది"

"ఇంక నేనేం చెప్పేది? ఏవిటయిందో చెప్పరూ"

"ఇదుగో చూడు మా అమ్మని రమ్మనిరాస్తే రావడానికి బదులు ఏవని రాసిందో!"

"ఏవిటి రాసేరండి?"

"ఇదంతా నీనుంచే—నీ ముండితనం నించే"

"అసలేవిటి రాసేరూ?"

"రెండక్షరాలు నోటంట అనడానికి చచ్చిపోయావు! ఎంతచెప్పినా విన్నావా? నీతో మాటలేమిటి?"

"ఏమండి నేనేం చేశానని?"

"ఏం చేశావు! అత్తా అని పిలవమని ఎందరం అఘోరించినా, కడకి నోటంట తెగించి అదే అన్నా మొండికెత్తిపోయావు. అదే ఆఖరికి ఇంతవరకూ వచ్చింది!"

"ఇంతకీ ఏమిటయిందో చెప్పండి? అత్తా అనిపిలిచే మరో అమ్మాయినిగాని తెస్తున్నారా ఏమిటి మీకు?" అని వేళాకోళంగా అంది.

"చాల్లే నీ వెటకారం. నాకింతవరకూ ఆ వూహే తోచలేదు లేకపోతే ఇంతవరకూ రాకముందే ఆ పనిచేద్దును" అన్నాడు.

"అయితే ఏమయింది?"

"అక్కడ తన మేనకోడలు అత్తా అని ఎంతో ఆప్యాయంగా పిలుస్తూండిట, తనకి అక్కడే హాయిగా వుందట! ఇక్కడికి వస్తే మళ్ళీ యథాప్రకారమేనని, అంచేత తను తనబుద్ధి తిరిగేవరకూ అక్కడే ఉండిపోతానని ఖచ్చితంగా రాసింది ఇహనేం చెయ్యడం"

"మంచి బావుందండి! ఈపాటి దానికి అంత పట్టింపు చేస్తారనుకోలేదు!"

"లేదు. చాలా సంతోషిస్తారనుకున్నావు కదూ"

"అక్కడ ఎంతకాలమని ఉంటారు?"

"అంతేగాని నేను తప్పకుండా పిలుస్తాను, రమ్మనమనండి అని అనవు! దానికేం అది ఎన్నాళ్ళున్నా మహారాజులా పువ్వుల్లోపెట్టి పూజిస్తారు. ఎంత పుణ్యంచేస్తే పెద్ద దిక్కు దొరుకుతుంది! ఏమిటో అనుకుంటున్నావు!"

"ఇది మరీ బావుందండి నేనిలా అవుతుందనుకున్నానా?"

"పోనీగాని నీకెందుకింత పంతం? ఎందుకిన్నిసార్లు చెప్పినా పిలవ్వు ఇప్పుడు చెప్పు నాతో ఏమిటో!"

"..............."

"చెప్పు—"

"ఏమిటి చెప్పేదండి?"

"అదే ఎందుకు పిలవ్వు—"

"అదేమిటోనండి నాకు తెలీదు. నే చెప్పలేను"

"అదుగో ఐతే ఇహ నీకూ నాకూ పడదు"

"ఏవీలేదు వుట్టినే—"

"బావుంది వాలకం—"

"ఏం చెప్పనండి ఏంలేందే మరే కారణంలేదు. ఎన్నోసార్లు అనుకుంటాను పిలుద్దావని ఆవేళ కొచ్చేసరికి నోటంటరాదు పిలువలేకుండా ఉన్నాను సిగ్గూకాదు, చిన్నతనం కాదూ, ఏవీకాదు, అదేమిటో తెలీదు. ఏంచెయ్యడం?"

"ఇది బావుంది అన్నింటికంటేను!"

"ఇహనుండి తప్పకుండా పిలుస్తాను. రమ్మని రాయండి!"

"అలా రాయనా?"

"రాయండి ఒట్టు"

"వచ్చిన తర్వాత పిలవకపోతే నువ్వన్నట్టే అత్తా అని పిలిచే పిల్లని పెళ్ళి చేసుకుంటాను."

"పోనీ అలాగేలేండి"

"అలా అయితే ఇప్పుడే నువ్వుకూడా అలాపిలుస్తూ ఒక ఉత్తరం మీ అత్తగారికి రాసుకో!"

"అబ్బ నే రాయలేనండి అదోలా వుంటుంది"

"అలాగయితేనే చిక్కు నే చెబుతున్నాకదూ. అలా అయితేనే గాని రాదు!"

"మధ్య మీరూరుకోరు కదా!"

* * * *

ఇంటిముందు బండీ ఆగిన చప్పుడు అయింది. కమల ఆత్రుతతో "అదుగోనండీ వచ్చినట్టుంది?" అంది.

"మళ్ళీ మొదలెట్టేవు సుమీ!"

"లేదండీ!... అత్తగారు వచ్చినట్టుంది!"

"వెళ్ళి రమ్మను—"

"అబ్బ! మీరే వెళుదురూ! నాకదోలా వుంటుంది!"

"అలాగయితే ఆ బండిలోనే తిరిగి వెళ్ళిపోతుంది!"

"మీరు మరీనండీ!" అని అంటూ వీధిలోకి వెళ్ళి వస్తూన్న లక్ష్మమ్మని "రండి అత్తా!" పలకరించింది—

ఆ మాట వినగానే లక్ష్మమ్మ పొంగిపోయింది. చేతో పట్టుగున్న సామాను అక్కడే వదిలేసి కోడలి చెయ్యి పట్టుగుని లోపుకి వెళ్ళి పోయింది.

"ఏంవండీ... యీ పాటిదానికే యింత పనిచేస్తారా? యిక్కడ ఆయన పెద్ద గందరగోళం చేశారు!"

"అదుగో! మళ్ళీ అలాగే పిలుస్తావేమిటి!" అన్నాడతను—

"మీరూరుకుందురూ!" అని వెనకేసుకుంది.

"అమ్మో అలా అయితే అత్తాఅని పిలిచే మరో పిల్లని ఎక్కడన్నా చూడే. దీనికి విడాకులిచ్చేద్దాం!" అన్నాడు నవ్వుతూ.

"అదేఁవిటి— అలాటి మాటలు" అని వింతగా అడిగింది లక్ష్మమ్మ.

"నీ కోడలే చెప్పింది— ఇహమీదటి నుండీ అలా పిలవకపోతే, మళ్ళీ పెళ్ళి జేసుకోవచ్చని!"

"సరిపోయింది యిద్దరికీ!"

"రండత్తా ఆయనతో ఏమిటి! ఫలహారం చేద్దురుగాని..." అంది కోడలు.

ఇది వినగానే తన మేనకోడలుచెప్పిన ఎత్తు ఫలించిందని లక్ష్మమ్మ చాలా సంతోషించింది.

* * * *

మర్నాడు లక్ష్మమ్మని పలకరించడానికి అందరూవచ్చిగుమ్మంలో కూర్చుని పిచ్చాపాటి మాటాడుకుంటూండగా ఏదో పనుండి- కమల ఇవతలికి వచ్చి- "ఏమండీ అత్తా యిలా లోపలికోసారి రండి." అని పిలిచింది.

అది విని- "చూశావే అమ్మడూ యిప్పుడెలా పిలుస్తూందో" అంది సముద్రాలు.

"నే చెప్పలేదుటే- అనుభవం మీద అదే తెలుసుకుంటుందని, వూరికే యిదయిపోయారు అందరూను."

"అయినా దానికి మాత్రం తెలీదుటే- అలా ఆడించిందిగాని-"

"నిజంగా అత్తా కోడలూ వుంటున్న 'కళ' వచ్చింది యింటికి—" యిలా అంటూండగా- కెరటాలు- యినప గరిట పట్టుగువచ్చి-

"ఏం లక్ష్మమ్మ! పైని గూర్చున్నావు! యింట్లో ఎవరూ లేరూ! యివాళ అగ్గిపుల్లలు నిండుకున్నాయి కాస్త నిప్పు పట్టుకు వెళతాను!" అంది.

"వెళ్ళమ్మా కోడలు ఇస్తుందీ!"

"ఏవండోయ్ కోడలని మళ్ళీ పిలుస్తున్నారు? అయితే ఏదో విశేషం వుంది!" అంటూ లోపుకివెళ్ళి నిప్పు తీసుకుంటూ వుంటే—

"ఏమండీ మా అత్తగారు వస్తున్నారా?" అని కమల అడిగింది.

అది వినగానే కెరటాలు...

"నీ కడుపు చల్లగా! చక్కటి కొడుకుని కనాలి! ఏదీ— మళ్ళీ పిలువ్వూ!"

"వూరుకోండీ— అవేం మాటలూ!"

"ఎలా నేర్చుగున్నావు... అయినా నువ్వు తెలివైనదానివేలే!" అంటూ చుట్టూచూసింది. "ఎంచక్కా చేసుకున్నాడే— ఇల్లంతాను! పెద్ద ఆఫీసర్ల బంగళాలా వుంది!" అని తిరిగి వెళ్ళిపోతూ వస్తూన్న లక్ష్మమ్మను చూసి...

"అత్తగారి వనిపించుకున్నావులే!" అంది. లక్ష్మమ్మ నవ్వుతూ వూరుకుంది.

ఆంధ్రపత్రిక, 9-7-52.